


## ప్రవాసి

"నిద్దురనెట్టి రామపద నీరజముల్ మది బెట్టి తంబురా ముద్దుగ పట్టి అన్యముల పూర్తిగ తాదిగనాడివైచి" అంటూ తమ తల్లీనతను తన్మయగాన వాణిలో చెప్పీ చెప్పకుండా చెప్పారు స్వరరాగ సామ్రాజ్య సార్వభౌములు త్యాగరాజులవారు. త్యాగరాజుల వారికి మల్లేనే ఒక మహాత్ములు అణకువతో మెలకువతో భగవన్నామస్మరణం చేసేవారు, రాత్రిందివాలు.

"అదేమిటి అహరహస్మరణంలో మీరలిసిపోరా? అందుకని మధ్య మధ్య ఓ కోడికునుకు తీస్తో వుండండి. దానివల్ల వచ్చిపడే హాని ఏమిలేదు?" అని వారికి ఓ పెద్ద మనిషి సలహా ఇచ్చారు.

"నాయనా! ఏ మనిషిని పాదాలకింద మహారౌరవ నరకాగ్ని అనుక్షణం కాలుస్తూ వుంటుందో, ఎవర్ని ఉత్తమ ఊర్ధ్వలోకాలు ఎప్పుడూ పిలుస్తూ వుంటాయో ఆ ప్రాణికి నిద్దరెట్టా వొస్తుంది?" అన్నారు ప్రత్యుత్తరమిస్తూ మహాత్ములు నిర్లిప్తంగా.

"ఎవ్వారి జిహ్వపై ఈశ్వర నామమ్ము
నిత్యగానంచేచు నిలిచిపోవు
అవ్వారి దేహమ్ము అస్థిపంజరమౌను
నిద్దుర కనులందు నిలువలేదు
ఎముకల మాంసమ్ము ఎంత మాత్రమ్మేని
పేరుకోజాలదు పెరుగలేదు"

అంటారు మహాన్ భక్తులు కబీరుదాస్. భక్తుడి జీవితం అహరహా ఈశ్వర విరసూ సముద్రమైపోతుంది. అంతులేని భావాలకెరటాల తాకిడికి నిద్దరెట్టా తట్టుకు నిలవగలదు? ❋

---

# బ్రిటన్‌లో సత్యసాయిబాబాపై పుకార్లు!

సాయిబాబా భక్తులు ఆయనను దైవసమానునిగా భావిస్తున్నా, బ్రిటిష్ ఫారిన్ ఆఫీసు మాత్రం ఆయనపై వేరే అభిప్రాయం ఏర్పరుచుకున్నట్లు కనిపిస్తున్నది. బ్రిటీష్ ఫారిన్ ఆఫీస్ బాబా చర్యలను కనిపెడుతున్నట్లుగాను, అక్కడికి వెళ్లే వారికి బాబా గురించి హెచ్చరిస్తున్నట్లు లండన్ నుంచి వెలువడే దిటైమ్స్ పత్రిక తెలియచేస్తోంది.

మాజీ హోమ్ ఆఫీస్ మినిస్టర్, ఛైర్మన్ అయిన టామ్ సాక్ విల్లీ బ్రిటీష్ గవర్నమెంటును బ్రిటన్ నుంచి వెళ్ళే యువతని బాబాకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేయకుండా అడ్డుకొమ్మని కోరినట్లుగా ఈ పత్రిక చెబుతోంది. కానీ న్యూఢిల్లీ లోని వారి రాయబార కార్యాలయం తమకి ఆవిధమైన ఆదేశాలేవీ లండన్ నుండి అందలేదని చెబుతోంది.



ది టైమ్స్ పత్రిక ప్రకారం, ముగ్గురు బ్రిటన్ దేశస్థులు భారతదేశంలోని దైవసమానుడైన సాయిబాబా మీద నమ్మకం పెంచుకున్న తరువాత ఆత్మహత్య చేసుకుని చనిపోయారుట. వారి మరణం ఒక మర్మంగానే మిగిలిపోయి ఉందట. మరణించిన ముగ్గురూ మగవారే. పుట్టపర్తిలో వారిపై జరిగిన శారీరకమైన దౌర్జన్యం కారణంగానే వారు మరణించినట్లు ఆ పత్రిక తెలియచేస్తోంది.

మైకల్ పెండర్, ఎయిడ్స్ బాధితుడైన ఈ విద్యార్థి లండన్‌లోని ఒక అనాథాశ్రమంలో విపరీతమైన తాగుడు నిద్ర మాత్రల వల్ల చనిపోయాడు. ఇతడు అంతకుముందు ఒకసారి ఆశ్రమంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పబడుతోంది.

అరన్ ఎడవర్ట్ ఒక గిటారిస్ట్, థియాలజీలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థి అయిన ఇతడు సాయిబాబా భక్తుడయిన తర్వాతే ఉరిపోసుకున్నాడట.

మూడవ వ్యక్తి ఆండ్రూ రిచర్డ్‌సన్ ఆశ్రమంనుంచి తిరిగి వచ్చిన కొద్దిరోజులలోనే ఒక భవంతిపై నుండి దూకి మరణించాడట.

యు.కె. లోని సాయిబాబా భక్తులైన కొందరు ఈ విషయాలు చెప్పగా, లండన్‌లోని సాయిబాబా ఆశ్రమానికి చెందిన దీ పురి శారీరక దౌర్జన్యం అనే విషయాన్ని ఖండిస్తూ "నాకు తెలిసినంత వరకు ఆయన ఒక గొప్ప గురువు" అంటున్నది. ❋